క్లుప్తంగా

డెకాథ్లాన్‌లో స్వర్ణం సాధించిన జిల్లావాసి


పరుశురామ్

కామారెడ్డి అర్బన్: గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి 36వ సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025లో కామారెడ్డి జిల్లాకు చెందిన జి.పరుశురామ్ స్వర్ణ పతకం సాధించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్ రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–20 డెకాథ్లాన్‌లో పరుశురామ్ 6,237 పాయింట్లు సాధించి స్వర్ణ పతకం సాధించి జిల్లాకే కాకుండా రాష్ట్రానికి వన్నె తెచ్చారని అభినందించారు.

కాలభైరవుడి సేవలో హైకోర్టు అదనపు జడ్జి



రామారెడ్డి: ఇసన్నపల్లి కాలభైరవుడిని హైకోర్టు అదనపు జడ్జి నర్సింగ్‌రావు శనివారం దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రం, తీర్థ ప్రసాదాలను ఈవో ప్రభుగుప్తా జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ అందజేశారు. జిల్లా జడ్జి వరప్రసాద్, అర్చకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బీబీపేట: జనగామ గ్రామానికి చెందిన ఆకుల రోజా ప్రవీణ్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేల చెక్కును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, గ్రామాధ్యక్షుడు రాజబాబు, శివరాత్రి ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో లక్కీడ్రా బాక్సు ఏర్పాటు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బస్టాండ్ నుంచి ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం ప్రత్యేకంగా లక్కీ డ్రా బాక్సులు ఏర్పాటు చేసినట్లు కామారెడ్డి డిపో మేనేజర్ దినేష్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 6 వరకు ప్రయాణించే వారు తమ టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబరు రాసి లక్కీడ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. రీజియన్ పరిధిలో లక్కీడ్రాలో మొదటి బహుమతి కింద రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇస్తామని ఆయన తెలిపారు.

ప్రత్యేక వైద్య శిబిరం



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో శనివారం స్వస్థ్‌నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలు తమ జీవనశైలిలో మార్పులు చేయాలని ఉప్పు, నూనె, చక్కెర వాడకం తగ్గించాలని వైద్యులు సూచించారు. అలాగే పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, డాక్టర్ విజయభాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, ఆర్ఎంవో ఎంసీహెచ్ డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గైనకాలజిస్టులు త్రిలోక్య, రాంబాయి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, ఆరోగ్య సమస్యలున్న 52 మంది మహిళలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు రమేశ్, ఫరీదా, చంద్రకళ, యాదగిరి, గీత, సుభాష్, ఏఎన్ఎంలు భాగ్య, కవిత, అంజలి, సుజాత, రజిని తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా..


ఎల్లారెడ్డిలో బాపూజీ జయంతి నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు


గాంధారిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

సాక్షి నెట్‌వర్క్ :బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మూడు తరాల తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ కోసం పదవులను త్యాగం చేసిన మొదటి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించారు. బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..కొండా లక్ష్మణ్ బాపూజీ పీడిత ప్రజల పక్షపాతి అని కొనియాడారు. సామాజిక తెలంగాణ సాధించినప్పుడే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటు పడదామని పిలుపునిచ్చారు.


బోర్లంలో నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పిట్లం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


దోమకొండలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..


బీబీపేటలో ..

బాపూజీ నేటి తరానికి ఆదర్శనీయం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయ నేత అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, రాజయ్య, నాగరాజు, ఆజాద్, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న కలెక్టర్

మరోసారి పంటలను ముంచెత్తిన వరదనీరు


నాగిరెడ్డిపేట శివారులో పంటలను ముంచెత్తిన వరదనీరు


వాడి శివారులో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలోని పంటలను మరోసారి వరదనీరు శనివారం ముంచెత్తింది. ఎగువన ఉన్న సింగూర్ ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు దిగువకు విడుదల చేయడంతో మంజీరనదిలో చేరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వరదనీరు మంజీరనది పరివాహక ప్రాంతంలో ఉన్న పంటలను ముంచెత్తుతూ సుమారు 3 కిలోమీటర్ల మేర వెనక్కి వచ్చింది. దీంతో మండలంలోని గోపాల్‌పేట–బంజర జాతీయ రహదారికి ఇరువైపులా పంటపొలాల్లో వరదనీరు చేరి చెరువును తలపిస్తుంది. ఇటీవలే పొట్ట దశను దాటి ఈనిన పంటపొలాల్లో వరదనీరు వచ్చి చేరడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్‌లో శనివారం భగత్ సింగ్ జయంతిని పలు యువజన సంఘాల సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉరి తాడును ముద్దాడి నేలకొరిగిన విప్లవకారుడు భగత్ సింగ్ అని కొనియాడారు.

జలదిగ్బంధంలో శివాలయం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోలిలింగాల గ్రామశివారులో మంజీర నది ఒడ్డున వెలసిన శివాలయం శనివారం జల వలయంలో చిక్కుకుంది. ఎగువన ఉన్న సింగూర్ ప్రాజెక్టు నుంచి భారీగా వచ్చిన వరద నీటిలో శివాలయం పూర్తిగా మునిగిపోయింది. ఆలయ ప్రాంగణం ముందున్న స్లాబ్ లెవల్‌లో వరద నీరు ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది.

సీనియార్టీ ప్రాతిపదికన విధులు కేటాయించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉపాధ్యాయులకు సీనియార్టీ ప్రకారం విధులు కేటాయించకుండా జూనియర్ ఉపాధ్యాయులకు పీవో, సీనియర్ ఉపాధ్యాయులకు ఓపీవో విధులు కేటాయించటం సరైన పద్ధతి కాదని టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం డీఈవో రాజు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌లకు వినతి పత్రం అందజేశారు. దివ్యాంగ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అటవీభూమి కబ్జా అడ్డగింత



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులో గల అటవీ భూమిని ఒక వ్యక్తి కబ్జా చేసేందుకు యత్నించగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. అటవీభూమిలో నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించగా.. వారు అడ్డుకున్నారు.ఈ మేరకు అటవీభూమిలోని బండరాయిపై వేసిన పెయింటింగ్‌లను వారు చెరిపివేశారు.అటవీభూమి కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని డిప్యూటీ ఫారెస్ట్‌రేంజ్ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. ఫారెస్ట్ బీట్ అధికారి నవీన్ ఉన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు


పెద్దకొడప్‌గల్‌లో రాజకీయ పార్టీల నేతల మధ్య డ్రా ద్వారా వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఆర్డీవోల ఆధ్వర్యంలో ఖరారు చేశారు. పంచాయతీ వార్డు సభ్యులకు రిజర్వేషన్లను ఎంపీడీవోల ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించి ఖరారు చేశారు.


ఎల్లారెడ్డిలో.. ఎంపీడీవో ప్రకాష్


బాన్సువాడలో.. ఎంపీడీవో ఆనంద్, తహసీల్దార్ వరప్రసాద్


నాగిరెడ్డిపేటలో..

బీఆర్ఎస్‌లో చేరిక



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండ మాజీ సర్పంచ్ తిరుపతిరావుతో పాటు 30 మందికి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో శనివారం చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, పాల్వంచ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, నేతలు విద్యాసాగర్‌రావు, రాఘవేందర్, స్వామి, శ్రీను, నర్సింలు, యాదయ్య, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రైతుల సంక్షేమానికి కృషి



నిజాంసాగర్(జుక్కల్): రైతుల సంక్షేమానికి కోసం సహకార సంఘం తరపున కృషి చేస్తున్నామని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యుం నర్సింహారెడ్డి అన్నారు. శనివారం అచ్చంపేట రైతు వేదికలో అచ్చంపేట సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోళ్ల కమీషన్‌ను త్వరగా చెల్లించాలని కోరారు. సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, సీఈవో సంఘమేశ్వర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

రూ.30 వేల నష్ట పరిహారం అందించాలి

ఎల్లారెడ్డిరూరల్: పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని సొసైటీ అధ్యక్షుడు నర్సింలు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి సొసైటీలో నిర్వహించిన మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నరకం వడ్లకు బోనస్ ఇవ్వాలని అన్నారు. కార్యదర్శి విశ్వనాథం, రైతులు తదితరులున్నారు.

తాడ్వాయి సింగిల్ విండోలో సర్వసభ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో శనివారం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రుణాలు గురించి, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై చర్చించి తీర్మానించారు. ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణలో బీసీలకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక స్థానం కల్పించిందని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్ ముదిరాజ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన సందర్భంగా శనివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అయిలాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కురుమ సంగయ్య, ఉపాధ్యక్షుడిగా పరంధాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, కొడ రవి, సుప్పాల రాజు, అశోక్, బైరయ్య పాల్గొన్నారు.

నేడు చిన్నమల్లారెడ్డిలో విజయదశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో చిన్నమల్లారెడ్డి రామాలయం మున్నూరుకాపు సంఘంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఉప మండల ప్రముఖ్ చౌకి వెంకటరాజు తెలిపారు.

ధ్వంసమైన రహదారులు


శెట్పల్లిసంగారెడ్డి శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంతలు


లింగంపేట - మాల్తుమ్మెద రోడ్డులో..


వదల్పర్తి శివారులో ..

- అదుపు తప్పుతున్న వాహనాలు
- గాయాలపాలవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపేట–మాల్తుమ్మెద రోడ్డులో భారీ గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డబుల్ రోడ్డులో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద నుంచి గాంధారి, మంచిప్ప మీదుగా నిజామాబాద్‌కు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మాల్తుమ్మెద నుంచి లింగంపేట వరకు 18 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు వేసిన నాలుగేళ్లకే ధ్వంసం అవుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల అటవీ శాఖ అనుమతులు లేక శెట్పల్లి తండా నుంచి లింగంపేట వరకు, పర్మళ్ల శివారు నుంచి సజ్జన్‌పల్లి చౌరస్తా వరకు సింగిల్ రోడ్డు ఉండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డులో కల్వర్టులు నిర్మించారు. కల్వర్టుల వద్ద సీసీ, బీటీ వేయకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు గుంతలమయమై వాహన చోదకులు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. డబుల్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

కుంకుమార్చనలు.. ప్రత్యేక పూజలు.. అన్నదానాలు


దోమకొండలో దుర్గామాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


రాజంపేటలో..

సాక్షి నెట్‌వర్క్:జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల వద్ద భక్తులు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, యాగాలు చేపట్టారు. పలు చోట్ల మండపాల నిర్వాహకులు అన్నదానాలు చేశారు. కొన్నిచోట్ల అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. లలితా త్రిపుర సుందరి, లక్ష్మీదేవిగా వివిధ మండపాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు.


బాన్సువాడ కోటదుర్గమ్మ ఆలయంలో చండీ యాగం


జనగామలో..


కామారెడ్డి అర్బన్: త్రిశక్తి ఆలయంలో లలితా హోమం


జంగంపల్లిలో కరెన్సీ నోట్లతో అలంకరణ


ఎండ్రియాల్‌లో దుర్గామాత విగ్రహాన్ని సుమారు రూ. 20 లక్షల విలువైన నోట్లతో అలంకరణ


అడ్లూర్ ఎల్లారెడ్డిలో భజన కీర్తనల ఆలాపన


మద్నూర్‌లో దాండియా ఆడుతున్న చిన్నారులు


దేవునిపల్లిలో .. భవాని మాలధారులు

వక్కలపై దుర్గమ్మ

మద్నూర్(జుక్కల్): శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు పండరి శనివారం వక్కలపై దుర్గామాత, బతుకమ్మ చిత్రాలను వేశాడు. ప్రస్తుతం గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలు, బతుకమ్మ పండగను పురస్కరించుకొని ప్రత్యేకంగా ఉండటానికి చిన్న వక్కలపై కష్టపడి ఈ చిత్రాలను వేసినట్లు ఆయన తెలిపారు.


పండరి
మద్నూర్‌లో వక్కలపై దుర్గామాత, బతుకమ్మ చిత్రం